సాక్షి
నిజామాబాద్
బుధవారం ၊ 26 ၊ ఏప్రిల్ ၊ 2023



వీవోఏల నిరసన

తమ సమస్యల పరిష్కారం కోసం ఐకేపీ వీవోఏలు చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజు కొనసాగింది.

- 9లో ▸



సమ్మెలోకి ఆర్టిజన్లు

విద్యుత్‌శాఖలోని ఆర్టిజన్ ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. జిల్లాలోని ఆయా డివిజన్ల ఉద్యోగులు విధులు బహిష్కరించారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
38.2 /21.4

ఉదయం ఎండ కాస్తుంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమవుతుంది. పలుచోట్ల ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మలేరియా నిర్మూలనే లక్ష్యం



నిజామాబాద్‌సిటీ: మలేరియా వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుదర్శనం అన్నారు. మంగళవారం ప్రపంచ మలేరియా డే సందర్భంగా నిర్వహించిన ర్యాలీని నగరంలోని చంద్రశేఖర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు 2030 సంవత్సరం నాటికి మలేరియా అంతానికి మనమందరం కంకణబద్ధులం కావాలన్నారు. మంచినీటి ఆవాసాలలో దోమలు గుడ్లు పెడతాయని అవి లార్వా దశ తర్వాత ప్రౌఢ దోమలుగా మారుతాయన్నారు. ప్రజలు దోమలు పెరగకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా కీటక జనిత నియంత్రణ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, వైద్యులు జాహ్నవి, శ్రీలత, సుసేన, డీహెచ్‌ఈ ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, హెచ్‌ఈవో వెంకట్ రవి, హెచ్‌ఈ సలీం, ఏఎస్‌ఎం, ఆశా పాల్గొన్నారు.

30న కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష

- ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు
- ఉమ్మడి జిల్లాలో 640 పోస్టులు

ఖలీల్‌వాడి : జిల్లాలో ఈ నెల 30న కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష నిర్వహించడానికి పోలీస్‌శాఖ సన్నద్ధమవుతోంది. అందులో భాగంగా పార్ట్–2కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సంబంధించిన హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు ఈ నెల 28 వరకు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని రాష్ట్ర పోలీస్‌మండలి స్పష్టం చేసింది. ఉమ్మడి జిల్లాలో 10,131 మంది ఫిజికల్ టెస్ట్‌లకు హాజరయ్యారు. సివిల్ పోలీస్, టీఎస్‌ఎస్పీ, ఆర్మ్‌డ్ రిజర్వు, ఎస్పీఎఫ్, ఫైర్, జైళ్లశాఖ, రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టులకు ఈ నెల తుది రాత పరీక్ష నిర్వహించబోతున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పోలీస్ నియామక మండలి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. ప్రతి అభ్యర్థి www.tslprb.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ లాగిన్ ఐడీ ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

జిల్లా	పోస్టులు (సివిల్)	పోస్టులు (ఏఆర్)
కామారెడ్డి	154	86
నిజామాబాద్	266	134

ఎలుగుబంట్ల సంచారం



నిజాంసాగర్: నర్వ గ్రామ శివారులో మంగళవారం ఎలుగుబంట్లు సంచరించాయి. గ్రామానికి చెందిన పలువురు మహిళలు తునికాకు సేకరణ కోసం పాత చెరువు కట్ట వైపు వెళ్లారు. చెరువు కట్ట కింద పొదల్లో ఉన్న రెండు ఎలుగుబంట్లు వారివైపు పరుగెత్తుకుంటూ వచ్చాయి. సమీపంలో ఉన్న రైతులు, తాటి ముంజలు కోస్తున్న యువకులు దీనిని గమనించి కేకలు వేయడంతో రెండు ఎలుగుబంట్లు గుట్టవైపు వెళ్లిపోయాయి. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఆరోగ్య మహిళపై అవగాహన కల్పించాలి



బోధన్‌టౌన్(బోధన్): రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్యం కోసం చేపట్టిన 'ఆరోగ్య మహిళ' కార్యక్రమంపై అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా పేర్కొన్నారు. పట్టణంలోని రాకాసీపేట్ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగవారం ఆమె సందర్శించారు. మహిళలు ఆరోగ్య మహిళా కార్యక్రమానికి వచ్చేలా అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. అనంతరం పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విద్య, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, వైద్యురాలు అంజలీ జాంకార్ వైద్య సిబ్బంది ఉన్నారు.

ప్రకృతి ప్రకోపం





ఇందల్వాయి మండలం స్టేషన్ తండాలో కొట్టుకుపోయిన ధాన్యం

- జిల్లా వ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన వాన
- పలుచోట్ల వడగళ్ల వర్షం
- వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- చేతికొచ్చిన పంట నీటిపాలవడంతో అన్నదాత కన్నీరు
- తడిసిన ధాన్యాన్ని లెక్కల్లోకి తీసుకోని అధికారులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రైతన్నపై ప్రకృతి ప్రకోపం చూపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో పలుమార్లు అకాలవర్షం కారణంగా అన్నదాతలు కుదేలయ్యారు. పంటల చివరి దశలో పలు మండలాల్లో నీటిఎద్దడి ఇబ్బందులు పెట్టగా రైతులు అష్టకష్టాలు పడి సమస్యను అధిగమించారు. చివరకు పంట చేతికి వచ్చాక విడతలవారీగా కురుస్తున్న అకాల వర్షాలతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. పంట దిగుబడులు చేతికొచ్చాక విక్రయించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ అకాల వర్షాలతో నీటిపాలు కావడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం, కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం వర్షార్పణం కావడంతో అన్నదాతలు గగ్గోలు పెడుతున్నారు. జిల్లాలో సోమవారం రాత్రి, మంగళవారం మధ్యాహ్నం వరకు కురిసిన వర్షంతో ధాన్యం తడిసిపోగా, నువ్వు, సజ్జ, వరి, పొద్దుతిరుగుడు పంటలు నేలకొరిగాయి. అదేవిధంగా నిజామాబాద్ మార్కెట్‌లో విక్రయం కోసం తీసుకొచ్చిన పసుపు పెద్దఎత్తున తడిసిపోయింది. జిల్లాలో తాజాగా కురిసిన వాన వడగళ్లతో కురవడంతో రైతులకు నష్టం ఎక్కువగా వాటిల్లింది. కోతకు సిద్ధంగా ఉన్న వరి, సజ్జ, నువ్వు పంటలు దెబ్బతిన్నట్లు అంచనా. వ్యవసాయ అధికారుల ప్రాథమిక లెక్కల ప్రకారం జిల్లాలో 7 మండలాల్లోని 89 గ్రామాల్లో 3,018 మంది రైతులకు చెందిన 3,097 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. ఇందులో 7 మండలాల్లోని 80 గ్రామాల్లో 2,268 మంది రైతులకు చెందిన 2,432 ఎకరాల వరి పంట, ఒక మండలంలోని 7 గ్రామాల్లో 702 మంది రైతులకు చెందిన 610 ఎకరాల నువ్వు పంట, ఒక మండలంలోని 2 గ్రామాల్లో 48 మంది రైతులకు చెందిన 55 ఎకరాల్లో సజ్జ పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే నష్టం ఇందుకు అనేక రెట్లు ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు అన్ని మండలాల్లో రైతుల పంటలు దెబ్బతినడంతో పాటు ఆరబోసిన ధాన్యం నీటిపాలు కావడం గమనార్హం. ఇదిలా ఉండగా గత నెల రోజుల కాలంలో అకాల వర్షాలు కురవడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. మొత్తం మీద రైతులు సుమారు 5వేల ఎకరాల్లో పంట నష్టపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఇందుకు పలు రెట్లు ఎక్కువగా రైతులు నష్టపోయినట్లు తెలుస్తోంది. ఆరబోయగా తడిసిన ధాన్యాన్ని, మార్కెట్లో విక్రయం కోసం తీసుకురాగా తడిసిన పసుపును అధికారులు లెక్కల్లోకి తీసుకోవడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.



కొరట్‌పల్లిలో కురిసిన వడగండ్లు



కొరట్‌పల్లిలో నీటిపాలైన వరి పంట



నిజామాబాద్ మార్కెట్‌లో తడిసిన పసుపు కొమ్ములను ఆరబెడుతున్న రైతులు

జిల్లాలో 8.8 మి.మీ. వర్షం

సుభాష్‌నగర్: జిల్లా వ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు 8.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఇందల్వాయిలో 36.8 మిల్లీమీటర్లు, భీమ్‌గల్‌లో 27.9, జక్రాన్‌పల్లి లో 25.9, నిజామాబాద్‌నార్త్‌లో 18.0, డిచ్‌పల్లిలో 17.6, సిరికొండలో 16.8, మోపాల్‌లో 16.0, మోర్తాడ్‌లో 15.5, నిజామాబాద్ సౌత్‌లో 15.0, నిజామాబాద్ రూరల్‌లో 13.9, కమ్మర్‌పల్లిలో 12.8, మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని ఈ సీజన్‌లో 27 మండలాల్లో అ త్యధిక, 2 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. రానున్న రెండ్రోజులు కూడా ఉరుములు, మెరుపులతో ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తుందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

సాక్షి విద్యార్థులకు వేసవి శిబిరం

'సాక్షి' మీడియా గ్రూప్ ఈ నెల 26, 27, 28 తేదీల్లో వేసవి శిబిరాలకు ఆహ్వానం పలుకుతోంది. ఔత్సాహిక చిన్నారులు ఈ శిబిరాల్లో పాల్గొనవచ్చు.

- 26.04.2023న చిత్రలేఖనం పోటీ (4, 5, 6, 7, 8 తరగతుల విద్యార్థులకు మాత్రమే) మెటీరియల్ ఎవరిది వారే తెచ్చుకోవాలి.
- 27.04.2023న చదరంగం పోటీ (5, 6, 7 తరగతుల విద్యార్థులకు మాత్రమే)
- 28.04.2023న చదరంగం పోటీ (8, 9, 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే)

వేదిక: కాకతీయ ఒలంపియాడ్ స్కూల్, ప్రగతినగర్, నిజామాబాద్.

సమయం: ఉదయం 10 గంటల నుంచి

వివరాలకు, పేర్ల నమోదుకు 9553130597, 8978036828 నంబర్లలో సంప్రదించాలి.

కేసీఆర్ ప్రధాని అయితే తప్పా?

- పీఎం కుర్చీ మీ జాగీరా
- బీజేపీపై మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఫైర్

కమ్మర్‌పల్లి: అదానీ, అంబానీలకు బ్రోకర్లుగా ఉన్నోళ్లు ప్రధాని అయితే తప్పు లేదు కానీ, రైతుల కోసం పనిచేస్తున్న కేసీఆర్ ప్రధాని అయితే తప్పా అని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. దేశ ప్రధాని అయ్యే అర్హతలు అన్ని సీఎం కేసీఆర్‌కు ఉన్నాయని ఉద్ఘాటించారు. మంగళవారం కమ్మర్‌పల్లిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ బాల్కొండ నియోజకవర్గ ప్రతినిధుల సభలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి రాజ్యసభ ఎంపీ సురేశ్‌రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రధాని కుర్చీ ఖాళీ లేదని అన్న వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, 'ప్రధాని కుర్చీ ఏమన్నా అబ్బ సొత్తా, అబ్బ జాగీరా' అంటూ ధ్వజమెత్తారు.

హేమ హేమీలనే మట్టికరిపించిన చరిత్ర ప్రజలకు ఉందని, నరేంద్ర మోదీ ఓ లెక్కనా అంటూ ఘాటుగా విమర్శించారు. అబ్‌కీ బార్ కిసాన్ సర్కార్ అని సీఎం కేసీఆర్ బయలు దేరాడని, ఢిల్లీ పీఠం కదులుతోందని చెప్పారు. మోదీ, అమిత్‌షాలకు కేసీఆర్ భయం పట్టుకుందని, దేశంలో బీఆర్‌ఎస్ ప్రభంజనం మొదలైందన్నారు. అందుకే కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని ఎమ్మెల్సీ కవితను ఈడీ, సీబీ దర్యాప్తుల పేరుతో వేధిస్తున్నారని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 98 స్థానాల్లో ఘన విజయం సాధించబోతుందని జోస్యం చెప్పారు. తనకు 62 శాతానికి పైగా ప్రజల మద్దతు ఉందని ధీమా వ్యక్తం చేశారు. 8 ఏళ్లలో బాల్కొండ నియోజకవర్గంలో రూ. 6,500 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

తలసరి ఆదాయంలో నంబర్ వన్

తలసరి ఆదాయంలో రాష్ట్రం దేశంలో మొదటి స్థానంలో ఉందని దీనికి కారణం సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలేనని ఎంపీ సురేశ్‌రెడ్డి అన్నారు. కేసీఆర్‌ను బలహీనం చేయాలనే కుట్ర జరుగుతోందన్నారు. దేశంలో నాయకుడే ఉండకుండా బీజేపీ చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రం అభివృద్ధిలో వేగంగా దూసుకెళ్తోందన్నారు. కేసీఆర్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పార్టీ ప్రతిపాదించిన 13 అంశాలను తీర్మానించి ఆమోదించారు. సభలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, నాయకులు డాక్టర్ మధుశేఖర్, రాజారాం యాదవ్ పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో నిర్వహించిన ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

పంట నష్టంపై రోజువారీగా నివేదించాలి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): జిల్లా వ్యాప్తంగా అకాల వర్షాలు కురుస్తున్నందున పంట నష్టం వివరాలను రోజూవారీగా నివేదించాలని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ సూచించారు. మంగళవారం ఏడీఏలు, ఏవోలు, ఏఈవోలు, హార్టికల్చర్ అధికారులతో మండలకేంద్రంలోని రైతు వేదికలో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 39 గ్రామాల్లో 3,091 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తెలిపారు. అందులో వరి 2,432 ఎకరాలు ఉందని, 610 ఎకరాల్లో నువ్వు, సజ్జ, జొన్న 55 ఎకరాల్లో నష్టపోయాయన్నారు. అకాల వర్షాలతో పంట తడిసిన, నేలకొరిగిన రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా పండ్లు, ఇతర పంటల నష్ట అంచనాలను నివేదించాలని ఆదేశించారు. బుధవారం నుంచి అధికారులు గ్రామాల్లో పర్యటించాలని, విధులపై ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు.

నేడు తెయూ ఈసీ సమావేశం

- ఇటీవల పాలకమండలి నిర్ణయాలను వ్యతిరేకించిన వీసీ రవీందర్
- నేటి సమావేశంపై సర్వత్రా ఆసక్తి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పాలక మండలి(ఈసీ) సమావేశం బుధవారం హైదరాబాద్ లోని రూసా భవనంలో జరుగనుంది. ఈ నెల 19న నిర్వహించిన ఈసీ సమావేశంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధినిని విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ వాకాటి కరుణ, కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్‌లు బయటకు పంపించారు. అనంతరం జరిగిన గందరగోళం మధ్య ఈసీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న వీసీ రవీందర్ సమావేశాన్ని వాకౌట్ చేశారు. తర్వాత వాకాటి కరుణ చైర్మన్‌గా ఈసీ సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేశారు. అందులో భాగంగా యాదగిరిని రెండేళ్ల కాలానికి రిజిస్ట్రార్‌గా నియమించడంతో పాటు అలాగే ఈ నెల 26న మరోసారి ఈసీ సమావేశం ఉంటుందని తీర్మానించారు. వీసీ అధికారాలకు కత్తెర వేయడంతో పాటు 2021 నవంబర్ 27 తర్వాత ఈసీ అనుమతి లేకుండా వీసీ జరిపిన చెల్లింపులు, కొనుగోళ్లు, నిధుల దుబారా అన్నింటిపై విచారణ చేయాలని ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు.

ఉన్నతాధికారులకు వీసీ ఫిర్యాదు..

19న జరిగిన ఈసీ సమావేశంలో నిర్ణయించిన తీర్మానాలను ఈసీ చైర్మన్‌గా తాను లేదా గవర్నర్ ఆమోదించాల్సి ఉంటుందని.. అలా జరగలేదు కాబట్టి వాటిని రద్దు చేయాలని వీసీ రవీందర్ ప్రభుత్వ ఉన్నతాధికారులకు లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. అలాగే రిజిస్ట్రార్‌గా యాదగిరి బాధ్యతలు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. వీటన్నింటిపై వర్సిటీలో మంగళవారం ప్రెస్‌మీట్ నిర్వహించేందుకు వీసీ నిర్ణయించారు. తెలుగు ప్రొఫెసర్ బాల శ్రీనివాసమూర్తి మృతితో ప్రెస్‌మీట్‌ను రద్దు చేసుకున్నారు. బాల శ్రీనివాస మూర్తి మృతదేహానికి నివాళులర్పించిన తర్వాత ఇటీవల ఇచ్చిన సీఏఎస్ పదోన్నతులు రద్దు చేస్తున్నట్లు ఈసీలో నిర్ణయించడంతోనే మనస్తాపానికి గురై బాల శ్రీనివాసమూర్తి మృతి చెందారని వీసీ ఆరోపించారు. ఈసీ నిర్ణయాలను తప్పు పట్టడం, ప్రొఫెసర్ మృతి అంశాన్ని రాజకీయం చేస్తూ ఈసీ సభ్యులపై ఆరోపణలు చేయడంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో నేడు జరుగబోయే ఈసీ సమావేశంలో ఈ అంశాలు చర్చకు వచ్చే అవకాశాలున్నాయి.

నాకు సమాచారం లేదు

ఈ నెల 19న నిర్వహించిన ఈసీ సమావేశాన్ని నేను వాకౌట్ చేశాను. నా ఆమోదం లేకుండా ఈసీలో నిర్ణయించిన తీర్మానాలు చెల్లవు. ఈ నెల 26న ఈసీ సమావేశం ఉన్నట్లు నాకు అధికారికంగా ఎలాంటి సమాచారం లేదు. ఈసీ సమావేశం ఉన్నట్లు తెలిసిన వెంటనే వాయిదా వేయాలని కోరుతూ విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీకి లేఖ రాశాను. దీనిపై ఎలాంటి సమాధానం రాలేదు. బుధవారం జరిగే ఈసీ సమావేశానికి నేను హాజరు కావడం లేదు.

– రవీందర్, వీసీ

వీసీకి సమాచారం ఇచ్చాం

ఈ నెల 19న ఈసీ సమావేశం జరిగిన మరుసటి రోజునే ఈసీ సమావేశంలో నిర్ణయించిన తీర్మానాల కాపీని వీసీ రవీందర్‌కు పంపిచాం. అలాగే మూడు రోజుల నుంచి 26న జరగబోయే ఈసీ సమావేశంలో ఎజెండా అంశాలపై చర్చిస్తున్నాను. ఈసీ మీటింగ్ గురించి వీసీకి సమాచారం ఉంది.

–యాదగిరి, రిజిస్ట్రార్

ప్రశాంతంగా ఓపెన్ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో మంగళవారం ఇంటర్, పదో తరగతి ఓపెన్ పరీక్షలు జరిగా యి. పదో తరగతి పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వర కు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సా యంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు కొన సాగాయి. మొత్తం 985 మందికి గాను 873 మంది పరీక్షలకు హాజరయ్యారు. 112 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల్లో 1,407 మంది విద్యార్థులకు గాను 1,241 మంది హాజరయ్యారు. 166 మంది గైర్హాజయ్యారు.

ఖైదీల్లో మార్పు కోసం జైలు జీవితం..

- రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి
- సారంగపూర్ జిల్లా జైలు పరిశీలన





మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డికి స్వాగతం పలుకుతున్న జైలు సూపరింటెండెంట్ ప్రమోద్, మహిళ ఖైదీలతో మాట్లాడుతున్న సునీతా లక్ష్మారెడ్డి

ఖలీల్‌వాడి: ఖైదీల్లో మార్పు వచ్చేందుకు జైలు జీవితం ఉపయోగపడుతుందని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. నగరంలోని సారంగపూర్ శివారులోని జిల్లా జైలును ఆరుగురు సభ్యులతో కూడిన బృందంతో కలిసి సందర్శించారు. జైలులో ఖైదీలు, వారికి కల్పిస్తున్న వసతి, సదుపాయాలను పరిశీలించారు. కారాగారంలో ఉన్న అన్ని బ్యారక్‌లు తిరుగుతూ ఖైదీలను కలిసి జైలులో వారికి అందిస్తున్న భోజనం, ఇతర సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళా ఖైదీలను పలకరిస్తూ ఏ కేసులో జైలుకు వచ్చారని ఆరా తీశారు. చేసిన తప్పులను సరిదిద్దుకోవాలని, ప్రతి ఒక్కరిలో పశ్చాత్తాపం కలగాలన్నారు. మహిళా ఖైదీల వెంట వారి చిన్నారులు కూడా జైలులో ఉండడంతో ఐదేళ్లు దాటిన పిల్లలను ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పించేలా కలెక్టర్‌ను లిఖితపూర్వకంగా కోరాలని జైలు సూపరింటెండెంట్‌కు సూచించారు. జైలు జీవితం గడుపుతున్న వారిలో మానసిక ఆందోళనను దూరం చేస్తూ, వారిలో సత్ప్రవర్తనను పెంపొందించేందుకు యోగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేయా లని, సఖి కేంద్రానికి చెందిన నిపుణుల ద్వారా కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ఖైదీలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, జైలు నిబంధలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఖైదీలు తయారు చేస్తున్న వివిధ వస్తువులను పరిశీలించారు. వారికి మరింత ఉపాధి కల్పించాలని అధికారులకు సూచించారు. ఖైదీల కోసం వండిన భోజనం నాణ్యతను పరిశీలించారు. జైలు ఆవరణ పచ్చదనంతో ఉండడంపై జైలు సూపరింటెండెంట్ ప్రమోద్, జైలర్లు రాజశేఖర్, ఉపేందర్ రావు, సిబ్బందిని అభినందించారు. జిల్లా జైలును సందర్శించిన వారిలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు షాహీన్, రేవతి, సూదం లక్ష్మి, పద్మ, ఈశ్వరీబాయి, ఉమాదేవి, డైరెక్టర్ శారద, ఆర్డీవో రవి, జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారిణి సుధారాణి తదితరులున్నారు.

త్వరలో ఎస్సైల బదిలీలు..?

- మేలో ట్రాన్స్‌ఫర్స్‌కు సన్నాహాలు
- ఏడాదిన్నర నుంచి రెండేళ్లు ఉన్న వారికి..
- ఎలక్షన్స్ నేపథ్యంలోనే తర్జనభర్జనలు

ఖలీల్‌వాడి: జిల్లాలో ఎస్సైల బదిలీలకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఒకే పోలీస్‌స్టేషన్‌లో ఏడాదిన్నర నుంచి రెండేళ్లకు పైగా ఉన్న ఎస్సైలు బదిలీ చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే జిల్లాలోని పలువురు ఎస్సైలకు బదిలీలకు సంబంధించిన మేసేజ్ వచ్చినట్లు తెలిసింది. బదిలీలు జరుగుతున్న ఎస్సైలు పోస్టింగ్‌ల కోసం ప్రజాప్రతినిధులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధి సిఫార్సు లేఖ లేనిదే ఎస్సైగా పోస్టింగ్ లభించడం కష్టమని భావిస్తున్నారు. దీంతో ఎస్సైలు తమకు అనుకూలంగా ఉన్న వారి ద్వారా నియోజకవర్గ ప్రజాప్రతినిధి వద్దకు పోస్టింగ్ విషయం తీసుకెళ్తున్నారు. దీంతో తమ నియోజకవర్గానికి వచ్చే ఎస్సైలు రాబోయే ఎన్నికల్లో తమకు అనుకూలంగా వ్యవహరిస్తారా లేదా అనేది నియోజకవర్గ ప్రజాప్రతినిధులు పూర్తి వివరాలను తెలుసుకుంటున్నారు. అనంతరమే పోలీసు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తున్నట్లు తెలిసింది. నియోజకవర్గ పరిధిలో బదిలీలు ఉన్న వారి వివరాలను సైతం ప్రజాప్రతినిధులు తీసుకున్నట్లు సమాచారం. మే నెల చివరి వరకు జిల్లాలో ఉన్న సగం మందికి పైగా ఎస్సైల బదిలీలు జరుగుతాయని పోలీస్‌వర్గాల్లో చర్చ జరుగుతోంది. బాసర జోన్ పరిధిలో నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలు ఉన్నాయి. ఈ ఏడాది చివరి నాటికి శాసనసభ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ఎస్సైలను బదిలీలు చేసే అవకాశాలు ఉన్నందున ముందుగానే అనువైన మండలానికి వెళ్తే బాగుంటుందని ఎస్సైలు ఆలోచిస్తున్నారు. దీంతో బదిలీలు ఉన్న వారు ఏ మండలంలోని పోలీస్‌స్టేషన్ వెళ్తే బాగుంటుందని, ముందుగానే ఆ ప్రాంతంలో ఉన్న వారి బ్యాచ్‌కు చెందిన ఎస్సైలను అడిగి తెలుసుకుంటున్నారు. అంతేకాకుండా ఆ నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధి సహకారం ఎలా ఉంటుందనే కోణంలో ఆరా తీస్తున్నట్లు సమాచారం.

అతలాకుతలం..

- రెండు రోజులుగా కురుస్తున్న వడగండ్ల వాన
- నేలకొరిగిన వరి, నువ్వుల పంట
- వందల ఎకరాల్లో పంట నష్టం
- నష్టాన్ని అంచనావేస్తున్న అధికారులు
- రైతులను పరామర్శిస్తున్న ప్రజాప్రతినిధులు


దుబ్బాక్‌లో పడిపోయిన మామిడి చెట్లు


పిప్రిలో వర్షానికి నేలకొరిగిన కొనుగోలు కేంద్రం టెంట్‌


నిజామాబాద్‌ మార్కెట్‌యార్డులో తడిసిన పసుపు


భీమ్‌గల్‌లో కొట్టుకుపోయిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

జిల్లావ్యాప్తంగా వడగండ్ల వాన రైతులను అతలాకుతలం చేసింది. రెండు రోజుల పాటు కురిసిన వడగండ్ల వర్షానికి పంటల నష్టం లెక్కలేకుండా ఉంది. చేతికి వచ్చిన నువ్వులు, వరి పంటలకు అపారమైన నష్టం వాటిల్లింది. ఇందల్వాయి, సిరికొండ, మాక్లూర్‌, రెంజల్‌, ఆర్మూర్‌, ధర్పల్లి, నవీపేట్‌, మోర్తాడ్‌ బాల్కొండ, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్‌, మోపాల్‌ నిజామాబాద్‌ రూరల్‌, డొంకేశ్వర్‌, డిచ్‌పల్లి తదితర ప్రాంతాల్లో కురిసిన వడగండ్ల వాన కారణంగా ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. కొన్నిచోట్ల నీటి ప్రవాహనికి కొట్టుకుపోయింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టెంట్లు ఎగిరిపోయాయి. నవ్వుల పంట నేలవాలింది. నష్టాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. ఆయా ప్రాంతాల్లో పంటనష్టాన్ని అంచనా వేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్‌


మంచిప్పలో ఆరబెట్టిన ధాన్యం వద్ద నిలిచిన నీరు


నిజామాబాద్‌ మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యం


తిమ్మాపూర్‌లో పంటను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు మల్లికార్జున్‌ రెడ్డి


తడిసిన ధాన్యం చూపుతున్న మహిళా రైతు


తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు


మాక్లూర్‌లో వడగండ్లను చూపుతున్న రైతు


బాల్కొండలోని కొత్తపల్లిలో కుప్పల వద్ద నీళ్లు


జక్రాన్‌పల్లిలో పంటను పరిశీలిస్తున్న అధికారులు


మోర్తాడ్‌లో..


గన్నారంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌


సిరికొండలో తడిసిన ధాన్యం చూపుతున్న రైతులు


నవీపేట శివారులో కుప్పల వద్ద చేరిన వర్షం నీళ్లు


నిజామాబాద్‌రూరల్‌లోని శ్రీనగర్‌లో వరిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు


నికాల్‌పూర్‌లో నేలకొరిగిన నువ్వుల పంట


కొంకేశ్వర్‌ మండలం తొండాకూర్‌లో కల్లాల్లోకి చేరిన నీరు


డిచ్‌పల్లిలోని కొరట్‌పల్లి తండాలో వడ్లను ఏరుతున్న రైతు


కమ్మర్‌పల్లిలో నేలకొరిగిన నువ్వుల పంట

క్లుప్తంగా

ఆర్చరీ శిక్షణ శిబిరం ప్రారంభం



నిజామాబాద్‌ నాగారం : తెలంగాణ రాష్ట్ర క్రీడా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నాగారం లోని రాజారాం స్టేడియంలో ఆర్చరీ ఖేలో ఇండియా శిక్షణ శిబిరం ప్రారంభమైంది. మంగళ వారం డీవైఎస్‌వో ముత్తెన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడా కారులు ఆర్చరీలో శిక్షణ తీసుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. జూన్‌ 10 వరకు శిక్షణ కొనసా గుతుందన్నారు. వివరాలకు కోచ్‌ మురళి 9848919480 సంప్రదించాలన్నారు.

బీపీఈడీ పరీక్షల్లో ఒకరి డిబార్‌



తెయూ(డిచ్‌పల్లి) : తెయూ పరిధిలో రంజాన్‌ సందర్భంగా వాయిదా పడిన బీఈడీ మొదటి సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షలు మంగళవారం పునఃప్రారంభమైనట్లు కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ ఎం అరుణ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన మొదటి సెమిస్టర్‌ పరీక్షల్లో 1,303 మందికి గానూ 1,232 మంది హాజరు కాగా 71 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్‌ అరుణ తెలిపారు. ఆర్మూర్‌ నరేంద్ర డిగ్రీ కాలేజ్‌ పరీక్షా కేంద్రాన్ని కంట్రోలర్‌ అరుణ సందర్శించారు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న ఒక విద్యార్థి డిబార్‌ చేసినట్లు కంట్రోలర్‌ తెలిపారు.

ప్రశాంతంగా పరీక్షలు

తెయూ పరిధిలో కొనసాగుతున్న బీపీఎడ్‌ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలు మంగళ వారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ ఎం అరుణ తెలిపారు. ఉదయం జరిగిన 3వ సెమిస్టర్‌ పరీక్షల్లో 22 మందికి గానూ 18 మంది హాజరు కాగా 4గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు కంట్రోలర్‌ తెలిపారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్‌ అందజేత



ఖలీల్‌వాడి : తీవ్రమైన అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఉన్న ఈర శ్రీనివాస్‌ అనే వ్యక్తికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ తరఫున వీల్‌చైర్‌ను సంస్థ చైర్‌ పర్సన్‌, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల మంగళవారం బహుకరించారు. సిరికొండ మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్‌ అనారోగ్య, ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి పద్మావతి ఒక నివేదికను, సమాచారాన్ని సంస్థ చైర్‌ పర్సన్‌, జిల్లాజడ్జి కి నివేదించారు. దీంతో నిధులు సమీకరించిన ఆయనకు వీల్‌చైర్‌ అందజేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల మాట్లాడుతూ బాధితులకు చేదోడు వాదోడుగా న్యాయసేవా సంస్థ నిలుస్తుందన్నారు. సంస్థ పర్యవేక్షకులు పురుషోత్తం గౌడ్‌, చంద్రసేనారెడ్డి, పారా లీగల్‌ వలంటీర్లు ఉన్నారు.

రెండుగా చీలిపోయిన కాచాపూర్‌

భిక్కనూరు : ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఫ్యాక్టరీ ఇస్తున్న నిధులతో కాచాపూర్‌ గ్రామం అభివృద్ధి చేస్తే ఒప్పుకోమని కొందరు పేర్కొంటుండగా.. నిబంధనల మేరకే గ్రామాభివృద్ధికి ఫ్యాక్టరీ నుంచి నిధులు వస్తుంటే తీసుకుంటే తప్పేమిటని కొందరు.. ఇలా భిన్నాభిప్రాయాలతో భిక్కనూరు మండలం కాచాపూర్‌ గ్రామం రెండుగా చీలిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. భిక్కనూరు మండల కేంద్రంలో ఎంఎస్‌ఎన్‌ కెమికల్‌ ఫ్యాక్టరీ ఉంది. అయితే ఈ ఫ్యాక్టరీ కారణంగా సమీపంలో ఉన్న కాచాపూర్‌ గ్రామం చెరువులో చేపలు మృతి చెందుతున్నాయని, అలాగే వాతావరణం నీళ్లు కలుషితం అవుతున్నాయని, దుర్వాసన వస్తోందని పలుమార్లు కాచాపూర్‌ గ్రామస్తులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. వీడీసీ కూడా మద్దతు తెలిపింది. ఫ్యాక్టరీ యాజమాన్యం గ్రామానికి వచ్చి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటామని పేర్కొన్నప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. అయితే ఫ్యాక్టరీ సీఎస్‌ఆర్‌ నిధులు రూ. 1.50 కోట్లతో భిక్కనూరులో వీధి దీపాలు రోడ్డు డివైడర్లను ఏర్పాటు చేయించింది. అలాగే కాచాపూర్‌లోనూ రోడ్డు డివైడర్‌, హైమాస్ట్‌ లైట్లు, సీసీ కెమెరాల ఏర్పాటు సీఎస్‌ఆర్‌ నిధులివ్వాలని జీపీ పాలకవర్గం సర్పంచ్‌ సులోచన ఆధ్వర్యంలో ఎంఎస్‌ఎన్‌ ఫ్యాక్టరీని లేఖలో కోరగా వారు సమ్మతించి అవసరమైన రూ. 11.30 లక్షలను ఇచ్చేందుకు ముందుకొచ్చింది. అయితే ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఫ్యాక్టరీ నిధులు మనకొద్దని కొందరు యువకులు పట్టుబడుతున్నారు. మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణలో యువకులు రెండుగా చీలిపోగా అభిప్రాయ సేకరణ ఆగింది. ఫ్యాక్టరీ నిధులు కాచాపూర్‌కు అవసరం లేదని పేర్కొంటూ వీడీసీ సభ్యులు నిరసన తెలిపారు. అయితే ఫ్యాక్టరీ నిబంధనల మేరకే నిధులిస్తోందని అభివృద్ధి చేసుకుందామని ప్రజాప్రతినిధులు కొందరు యువకులు వాదిస్తున్నారు.


కాచాపూర్‌ జీపీ వద్దకు తరలివచ్చిన గ్రామస్తులు

కోర్టు డ్యూటీ సిబ్బందికి అభినందన

ఖలీల్‌వాడి : నేరస్తులకు జీవిత ఖైదీలుగా శిక్షలు పడేందుకు కృషి చేసిన కోర్టు, పోలీస్‌సిబ్బందిని ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్‌ మంగళవారం అభినందించారు. నగరంలోని సీపీ కార్యాలయంలో మూడో, ఐదో పోలీస్‌స్టేషన్‌ పరిధిల్లో నేరాల్లో జీవితఖైదీలకు శిక్షలు పడేందుకు కృషి చేసిన వారిని శాలువలతో సన్మానం చేసి ప్రశంసా పత్రాలు అందించారు. జిల్లా కోర్టు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ రవిరాజ్‌, అదనపు జిల్లా కోర్టు అదనపు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ లక్ష్మీనర్సయ్య, కోర్టు లైజనింగ్‌ ఆఫీసర్‌ ఎస్సై శ్యాం కుమార్‌, కోర్టు అసిస్టెంటు లైజనింగ్‌ ఆఫీసర్‌ స్వామి, మూడవ పోలీస్‌ కానిస్టేబుళ్లు కిశోర్‌, ప్రభు చరణ్‌, ఐదో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ కానిస్టేబుళ్లు బాల కృష్ణ, శ్యామ్‌రావులను అభినందించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్‌ సీపీ మాట్లాడుతూ కోర్టు సిబ్బంది ఎల్లప్పుడు కేసులలో నేరస్థులకు తగు శిక్ష పడే విధంగా అన్ని రకాలుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు పోలీస్‌ కమిషనర్‌ (ఏఆర్‌) గిరిరాజు, అదనపు పోలీస్‌ కమిషనర్‌ (అడ్మిన్‌) మధుసూదన్‌రావు. ఏసీపీ కిరణ్‌ కుమార్‌, ట్రాఫిక్‌ ఏసీపీ నారాయణ, స్పెషల్‌ బ్రాంచ్‌ సీఐ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందిని అభినందించిన ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్‌

సాక్షి క్లాసిఫైడ్స్‌

SERVICES

■ బాలాజీ గోల్డ్‌. మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్‌ ధరకు కొనబడును.(స్పాట్‌ క్యాష్‌) తాకట్టు షిఫ్టింగ్‌ చేయబడును. 90320 40019. [T-44]

PASSPORT MISSING

■ GAJIBUIKAR SRINIVAS S/o. BANSILAL GAJIBUIKAR గోవింద్‌ పేట్‌ ఇంటి నెం: 2-88 గోవింద్‌ పేట్‌ నుండి ఆర్మూర్‌ కు బైక్‌పై వెళ్తుండగా K9177839 పాస్‌పోర్టు పోయినది. దొరికిన యెడల సంప్ర॥ Cell: 98662 52386 [Z-1074491]

CHANGE OF NAME

■ I, NARELLA RAJAREDDY (Old Name) S/o.NERELLA CHINA RAJANNA Changed my Name as NERELLA RAJAREDDY (New Name), S/o. NERELLA CHINNA RAJANNA, R/o. H.No. 7-31/3, Narsing Pally, Sirikonda, Nizamabad. (T.S.) [Z-772239]

■ I, NARELLA CHINNA RAJANNA (Old Name) S/o.NERELLA RAJANNA, Changed my Name as NERELLA CHINNA RAJANNA (New Name) S/o. NERELLA RAJANNA R/o. H.No. 7-31/3,Narsing Pally, Sirikonda, Nizamabad. (T.S.) [Z-772238]

■ I, NARELLA LAXMI (Old Name) W/o.NERELLA RAJAREDDY Changed my Name as NERELLA LAXMI (New Name) W/o. NERELLA RAJAREDDY R/o. H.No.7-31/3,Narsing Pally, Sirikonda, Nizamabad. (T.S.) [Z-772241]

■ I, NARELLA RAJAMANI (Old Name) W/o.NERELLA CHINNA RAJANNA Changed my Name as NERELLA RAJAMANI (New Name) W/o. NERELLA CHINNA RAJANNA R/o. H.No. 7-31/3,Narsing Pally, Sirikonda, Nizamabad. (T.S.) [Z-772240]

4 లైన్ల క్లాసిఫైడ్‌ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

WANTED

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌/ఫుల్‌టైం పోస్టల్‌ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్‌. ఫ్రీ బుక్‌లెట్‌ కొరకు 9059509586 [G-785870]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్‌ ద్వారా రోజుకు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500/- సంపాదించు కోండి. మీ అడ్రస్‌ వాట్సాప్‌ చేయండి. వివరాలకు కాల్‌ చేయండి. 99596 17233, 6281704735. [M-1190681]

■ త్రివేణి హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకువర్కర్స్‌ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఏజెంట్‌ కమీషన్‌ 3K. ఫోన్‌: 9848571888 [H-793420]

■ విజయవాడలో A/c & Coolers రెంటల్‌ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్‌-3, డోర్స్‌ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ: 18-25,000 ట్రైనింగ్‌/భోజనం/వసతి ఫ్రీ ® 90300 44646. [B-1165937]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి నిజామాబాద్‌ CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

చోరీ కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

కామారెడ్డి క్రైం : దేవునిపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గతేడాది జరిగిన నాలుగు చోరీ కేసుల్లో ప్రధాన నిందితుడైన ఓ వ్యక్తికి కామారెడ్డి కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించింది. గతేడాది దేవునిపల్లి ఠాణా పరిధిలో పలు చోరీ కేసులు నమోదయ్యాయి. ఎస్సై ప్రసాద్‌ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి తగిన ఆధారాలను సేకరించి నిందితుడైన బిక్కాజీ రంజిత్‌ను అరెస్ట్‌ చేసి కోర్టులో హాజరుపర్చారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు..?

ఖలీల్‌వాడి : రంజాన్‌ రోజు జరిగిన గొడవలో కాంప్రమైజ్‌ కోసం పిలిచి యువకుడిని హత్య చేసిన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. జిల్లా కేంద్రంలోని ఐదో పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని బాబాన్‌ సాహెబ్‌ పహాడ్‌లో మహమ్మద్‌ అర్బాజ్‌ఖాన్‌(18)ను హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ హత్య కేసులో ప్రధాన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు సమాచారం. రంజాన్‌ రోజు హాజీ తన స్నేహితులతో కారులో వెళ్లే సమయంలో బైక్‌పై వెళ్తున్న అర్బాజ్‌ఖాన్‌పై బురద చల్లించడంతో వీరి మధ్య గొడవకు దారితీసింది. ఆదివారం జరిగిన ఘటనపై పోలీసులు అక్కడ ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించినట్లు తెలిసింది. ఈ హత్య కేసులో పోలీసులు ఐదుగురిని గుర్తించి, వీరితో పాటు మరికొందరు పేర్లు తెరపైకి రావడంతో వారిని కూడా విచారణ జరిపి కేసులు నమోదు చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. నగరంలోని బాబాసాహెబ్‌పహాడ్‌లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

క్రైం కార్నర్‌

ట్రాలీ ఆటో నుంచి సిలిండర్లు చోరీ

ఖలీల్‌వాడి : నగరంలోని ఒకటో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని అహ్మదీపురా కాలనీలో ఇండియన్‌ గ్యాస్‌ సంబంధించిన గ్యాస్‌ సిలెండర్ల ట్రాలీ ఆటో నుంచి సిలిండర్లు చోరీ జరిగినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్‌ తెలిపారు. అంచ సురేందర్‌ అనే వ్యక్తి బైక్‌పై వచ్చి సిలెండర్లు చోరీ చేసినట్లు గ్యాస్‌ కంపెనీకి చెందిన మహ్మద్‌ తెమాజ్‌ఖాన్‌ ఫిర్యాదు చేశారన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుడిసె దగ్ధం



మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌) : మండలంలోని మంచిప్ప తండాలో దేవిసింగ్‌కు చెందిన నివాసపు గుడిసె సోమవారం రాత్రి షాక్‌ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో ఈదురుగాలులకు విద్యుత్‌ తీగలు తగిలి నిప్పురవ్వలు గుడిసెపై పడటంతో ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో దుస్తులు, నిత్యావసర సరుకులు, టేకు దుంగలు, మంచాలు, ఇతరత్ర అన్ని వస్తువులు కాలిబూడిదయ్యాయి. నివాసపు గుడిసె కాలిపోవడంతో కుటుంబం రోడ్డున పడిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నారు. కాగా ఆర్‌ఐ రాజేశ్వర్‌ పంచనామా నిర్వహించారు. సుమారు రూ.4.04లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని తెలిపారు.

కుక్కల దాడిలో 14 గొర్రెలు మృత్యువాత



మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌) : నగర శివారులోని బోర్గాం(పి) 5వ డివిజన్‌లో సోమవారం అర్ధరాత్రి జరిగిన కుక్కల దాడిలో 14 గొర్రెలు మృతి చెందాయి. గ్రామంలోని దండు చిన్న భూమయ్యకు చెందిన 11 గొర్రెలు, రాములుకు చెందిన 4 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మరో 4 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. కుక్కల దాడిలో సుమారు రూ. లక్ష వరకు నష్టం జరిగిందని బాధితులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని వారు కోరారు.

ట్రాక్టర్‌ ఢీకొని మున్సిపల్‌ కార్మికుడి మృతి


ఆర్మూర్‌ లింగం(ఫైల్‌)

ఖలీల్‌వాడి : మున్సిపల్‌ కార్పొరేషన్‌ డ్రైవర్‌ నిర్లక్ష్యంగా ట్రాక్టర్‌ నడిపి పారిశుధ్య కార్మికుడిని ఢీకొనడంతో మృతి చెందినట్లు ఎస్సై పూర్ణేశ్వర్‌ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ నెల 18న నగరంలోని ఖిల్లా రోడ్డులోని గోల్డెన్‌జూబ్లీ స్కూల్‌ దగ్గర అవుట్‌సోర్సింగ్‌ ఉద్యోగి ఆర్మూర్‌ లింగం(48) ఉదయం ఏడు గంటలకు చెత్త ఎత్తుతున్నాడు. అయితే డ్రైవర్‌ నిర్లక్ష్యంగా ట్రాక్టర్‌ గేర్‌ వేసి వెనుక చెత్త ఎత్తుతున్న పారిశుధ్య కార్మికుడు ఆర్మూర్‌ లింగం పైకి తీసుకెళ్లడంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆయనను స్థానిక ప్రైవేట్‌ ఆస్పత్రిలో తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడు సర్కిల్‌ నెం. 3లో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో ఒకరు..

బోధన్‌టౌన్‌(బోధన్‌) : పట్టణంలోని రాకాసీపేట కాలనీలో నివాసం ఉంటున్న షేక్‌ అక్బర్‌(28) కుటుంబ కలహాలతో కలత చెంది సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పట్టణ ఎస్సై నవీన్‌కుమార్‌ తెలిపారు. పట్టణంలోని రాకాసీపేట్‌కు చెందిన షేక్‌ అక్బర్‌ కూలీ పనిచేసుకుంటు కుటుంబాన్ని పోషించేవాడు. ఏడు నెలల క్రితం నిజామాబాద్‌ నుండి బోధన్‌ పట్టణంలోని రాకాసీపేట్‌ కాలనీకి వచ్చి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. మద్యానికి బానిసైన అక్బర్‌ ప్రతి రోజు ఇంట్లో భార్యతో గొడవ పడేవాడన్నారు. సోమవారం రాత్రి మద్యం సేవించి గొడవ పడగా భార్య తన పిల్లలను తీసుకుని తన అన్న ఇంటికి వెళ్లిందని, ఇంట్లో ఒంటరిగా ఉన్న అక్బర్‌ మనస్తాపంతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత..


కస్తూరి (ఫైల్‌)

ఖలీల్‌వాడి : నగరంలోని నాలుగవ టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని బ్యాంక్‌కాలనీ(పాంగ్రా)కి చెందిన వివాహిత మహిళ కస్తూరి(28) అనుమాన్పదంగా మృతి చెందింది. ఎస్సై సందీప్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కస్తూరి కాలనీలోని పలు ఇళ్లల్లో పనిచేస్తుందని, రోజువారీగా ఇళ్లల్లో పనికి వెళ్లిన ఆమె ఈనెల 22న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు. ఆమె భర్త మల్లేష్‌ భార్య కోసం వెతికి చివరికి ఈ నెల 24న పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బ్యాంక్‌కాలనీలోని రమాదేవి వెంచర్‌లోని ఓ ఇంట్లోని బాత్‌రూం నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. ఈ ఇల్లు అమ్మడానికి పెట్టడంతో ఆ ఇంట్లో ఎవరూ లేరని, మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిందన్నారు. మృతురాలికి కుమారుడు బబ్లూ, కుమార్తె సాకేతా ఉన్నారని క్లూస్‌టీంతో విచారణ చేస్తున్నామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మద్యం తాగి రైతు..



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రానికి చెందిన బాజ లక్ష్మణ్‌(55) అతిగా మద్యం సేవించి మృతి చెందినట్లు ఎస్సై శంకర్‌ తెలిపారు. మృతుడు 24వ తేదీ సోమవారం ఇంట్లో నుంచి వెళ్లాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల వెతికారు. ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌ సమీపంలో కుంట వద్ద మద్యం సేవించి వాంతులు చేసుకొని అక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతునికి భార్య లింగమణి, ఇద్దరు కుమారులు కిషోర్‌, నవీన్‌ ఉన్నారు.

చెరువులో పడి ఒకరు..



నిజాంసాగర్‌(జుక్కల్‌) : జుక్కల్‌ మండలం బస్వాపూర్‌ గ్రామ శివారులోని బసవన్న చెరువులో పడి మంగళ వారం చంద్రుగౌండ(42) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై మురళి తెలిపారు. బస్వాపూర్‌ గ్రామానికి చెందిన చంద్రుగౌండ మద్యానికి బానిసై తాగిన మైకంలో చెరువులో పడి మృతి చెందాడన్నారు. మృతునికి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దార్యప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.